క్లుప్తంగా

చర్య తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కేసముద్రం : మండలంలోని ఇంటికన్నె శివారు సర్వేనంబర్ 23లో గల ప్రభుత్వ భూమిలో భూ కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని తహసీల్దార్ దామోదర్‌కు ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఐతే సారయ్య, మల్లయ్య, దేవేందర్, శ్రీనివాస్‌నాయక్, మిట్టకడుపుల యాకయ్య, గాదె శ్రీనివాస్ గురువారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో గతంలో తీసిన పెద్ద గుంతలో మట్టిని నింపి కబ్జాకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందించాలి



మాట్లాడుతున్న దేవేందర్

మహబూబాబాద్ అర్బన్ : ఉన్నత చదువుల నిమిత్తం విద్యార్థులు మీసేవలో దరఖాస్తులు చేసుకున్న కులం, ఆదాయం, నివాసం ధ్రువపత్రాలను వెంటనే అందించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి దేవేందర్ హాజరై మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం కళాశాలలో, గురుకుల పాఠశాలలో చేరేందుకు కులం, ఆదాయ, నివాసం పత్రాలు అవసరం పడతాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల జీవితాలకు శాపంగా మారిందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు స్పందించి విద్యార్థుల సర్టిఫికెట్లను త్వరితగతిన ఇవ్వాలన్నారు. అఖిల్, ప్రణయ్, రామ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు కృషి ఎనలేనిది

తొర్రూరు : రాష్ట్రాభివృద్ధిలో మంత్రి శ్రీధర్‌బాబు కృషి ఎనలేనిదని బోప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓలేటి లక్ష్మణాచార్యులు, ప్రతినిధులు కేవ్ సింగ్, సుధీర్, రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టార్గెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పుల్లూరి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్, అయోధ్యనగర్ గ్రామాల్లో నెల రోజులుగా నిర్వహిస్తున్న అథ్లెటిక్స్, వాలీబాల్ వేసవి శిక్షణా శిబిరాలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి బాటలు వేస్తాయని చెప్పారు.

అర్ధాకలితో పారిశుద్ధ్య సిబ్బంది



ఉప్పరగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం



పెద్దవంగరలో చెత్తను తరలిస్తున్న జీపీ కార్మికులు

- పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- నిస్సహాయ స్థితిలో మండల అధికారులు

పెద్దవంగర : కోడికూతకు ముందే వారంతా విధులకు హాజరవుతారు.. కాలమేదైనా తెల్లవారక ముందే గ్రామాలను అద్దంలా శుభ్రపరుస్తారు.. ఒక్క రోజు పనులకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తే గ్రామాల్లో కంపుకొట్టడం పక్కా.. పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర వారిది.. రెక్కాడితే గాని డొక్కాడని గ్రామపంచాయతీ కార్మికులపై అధికారులు, పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పెద్దవంగర మండలవ్యాప్తంగా..

మండల వ్యాప్తంగా 20 గ్రామపంచాయతీలున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో 69 మంది మల్టీపర్పస్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.8,500 చొప్పున వేతనాన్ని అందజేస్తోంది.

ఉదయం నాలుగు గంటలకే విధులకు..

మండల కేంద్రంతో పాటు 19 గ్రామాలు ఉండగా ఒక్కొక్క గ్రామంలో కనీసం ఆరు నుంచి పది కాలనీలు, అక్కడ పారిశుద్ధ్య సేవలు చేపట్టాలంటే ఉదయం నాలుగు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి మధ్యాహ్నం వరకు విధులు కొనసాగిస్తారు. వీరంతా ప్రతి రోజు గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేయడంతో పాటు ఇంటింటా చెత్త సేకరించి, మురికి కాల్వలు శుభ్రం చేయడంతో పాటు వివిధ పనులు చేస్తున్నారు. ఇవేకాక పాఠశాలను శుభ్రం చేయడం, డంపింగ్ యార్డుల్లో తడిపొడి చెత్తను వేరుచేసి వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌కు నీరు పోయడం మట్టి పనులు సైతం చేయాల్సిందే. గ్రామాల్లో పనిచేసే వారిలో 35 నుంచి 45 ఏళ్లలోపు వారే అధికం. కుటుంబ పోషణ కోసం కాలమేదైనా తట్టుకోని జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి వేతనాలు రాకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నారు.

నిధుల్లేక అవస్థలు..

ప్రస్తుతం పంచాయతీల్లో రెండేళ్లుగా ఎస్ఎఫ్‌సీ నిధులు, ఐదు నెలలుగా సీఎఫ్‌సీ నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామపంచాయతీలకు నిధులు సకాలంలో రాకపోవడంతో సిబ్బందికి వేతనాలు అందడం లేదు. జనరల్ ఫండ్ కూడా లేక పోవడంతో జీపీ కార్మికుల జీతాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వేతనాలు చెల్లించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు.

వేతనాలు అందించాలని జీపీ ఎదుట ధర్నా



నేరడ జీపీ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

కురవి : పది నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నామని వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని నేరడ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట జీపీ ఉద్యోగులు, సిబ్బంది గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగులు, సిబ్బంది మదూరి నాగయ్య, రాములు, మంజూర్ అలీ మాట్లాడారు. పది నెలలుగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్నామని, వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మల్టీపర్పస్ ఉద్యోగులుగా, ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న 11 మందికి వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఉన్నతాధికారులకు వేతనాల విషయమై అడిగితే ఎవరు ఉద్యోగంలో పెట్టుకున్నారో వారినే అడగాలని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి తమ సమస్యను పరిష్కరించి వేతనాలు ఇప్పించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పూట గడవడం కష్టంగా ఉంది



జీతాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులను అడిగితే జీపీలో బడ్జెట్ లేదని చెబుతున్నారు. నెలనెలా జీతాలు రాకపోతే గ్రామ పంచాయతీ సిబ్బంది పూట గడిచేది ఎట్లా. ఇచ్చే జీతం తక్కువే అవి కూడా రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి నెలనెలా వేతనాలు అందించాలి.

– ఓరుగంటి సోమనర్సయ్య, కారోబార్

నిధులు రావట్లేదు..



ప్రస్తుతం ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధులు రాకపోవడంతో జీపీ నడపడం ఇబ్బందిగా ఉంది. కొన్ని సందర్భాల్లో జనరల్ ఫండ్ నుంచి సిబ్బందికి వేతనాలు అందిస్తున్నాం. గ్రామ పంచాయతీల్లో ఉన్న ఇబ్బందులపై ఉన్నతాధిరుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– వేణుమాధవ్, ఎంపీడీఓ, పెద్దవంగర

వేడిని తరిమేందుకు..

- ఎండ నుంచి ఉపశమనం కోసం రోడ్లను తడిపిన మున్సిపల్ సిబ్బంది



రోడ్డుపై నీళ్లు చల్లుతున్న మున్సిపల్ సిబ్బంది

డోర్నకల్ : మే నెల.. రోళ్లు పగిలే రోహిణి కార్తె.. భానుడు భగభగమంటూ నిప్పులు కురిపిస్తున్నాడు. దీంతో సాధారణ జనం బయటికి రావాలంటే భయపడుతున్నారు. కాగా డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన రోడ్లపై గురువారం మున్సిపల్ సిబ్బంది రోడ్లను కూల్ చేసేందుకు నీళ్లు పోశారు. మండుతున్న ఎండలతో ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటంతో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డు, గాంధీసెంటర్, బ్యాంక్ స్ట్రీట్ తదితర వీధుల్లో మున్సిపల్ సిబ్బంది ట్యాంకర్లతో నీళ్లు చల్లి రోడ్లను కూల్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ బాబు, కాంగ్రెస్ నాయకులు సుమేర్‌చంద్‌జైన్, సుశీల్, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గూడూరు : మండలంలోని వెంగంపేటకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అల్వాల శ్రీనివాస్ (45) గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. ఖర్చుల నిమిత్తం కందూరు శోభన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కట్ల భవాని విష్ణు గౌడ్ రూ.17,500, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టే వెంకన్న రూ.5వేలు నగదు అందజేశారు.

పరామర్శ



డోర్నకల్ : అంబేడ్కర్‌నగర్ చెందిన కామపాటి శిరీష ఇటీవల మృతిచెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ గురువారం పరామర్శించారు. కౌన్సిలర్లు కొండేటి హేమచంద్రశేఖర్, శరత్, నాయకులు విద్యాసాగర్, యశోధర్ జైన్, మధు, రమేష్, రాంభద్రం, సతీష్‌కుమార్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

పనుల పూర్తి బాధ్యత హెచ్‌ఎంలదే



తొర్రూరు రూరల్: నాంచారిమడూరులో కమిటీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డీఈఓ



కేసముద్రం: సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ శాంతకుమారి

- డీఈఓ రామారావు

తొర్రూరు రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే పనుల పూర్తి బాధ్యత హెచ్‌ఎంల దేనని డీఈఓ రామారావు తెలిపారు. మండలంలోని నాంచారిమడూరు జయంతి కాలనీ, వెలికట్ట గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను గురువారం డీఈఓ పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అనంతరం ఏకరూప దుస్తులు కుడుతున్న మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ ఎంపిక చేసిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, తరగతి గదుల మరమ్మతులు చేపడుతున్నామన్నారు. జూన్ 12న పాఠశాలలు తెరుచుకునే నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. 922 పాఠశాలలకు గానూ 440 పాఠశాలల్లో ఏఏపీసీలను ఏర్పాటు చేశామన్నారు. వీటిల్లో రూ.12.42 కోట్లతో పనులు కొనసాగుతున్నాయన్నారు. ఎంఎన్‌ఓ మహంకాళి బుచ్చయ్య, సిబ్బంది వరలక్ష్మి, మల్లేశం, కల్పన, రాధిక, వీణ, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

కేసముద్రం : కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ శాంతాకుమారి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో హెచ్‌ఎంలు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఎంపికైన వివిధ పనులను జూన్ 5వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కొత్త జగన్‌మోహన్ రెడ్డి, ఇనుగుర్తి నోడల్ ఆఫీసర్ మంగతాయి, ఎంపీఓ ప్రసాద్, జిల్లా పరీక్షల బోర్డు చైర్మన్ విజయసుశీల, ఏఈఈ మానస, ఏపీఎం రాజీర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘భగీరథ’ వద్దు.. బావి నీళ్లు కావాలి



కురవి: చింతపల్లి జీపీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

కురవి : సీరోలు మండలంలోని చింతపల్లిలో మిషన్ భగీరథ నీరు వద్దని, బావి నీళ్లు కావాలని మహిళలు గురువారం జీపీ కార్యాలయం ఎదుట బిందెలతో నిరసన తెలిపారు. తాగునీటి సమస్యపై స్థానిక చేతిపంపు వద్ద బిందెలు పెట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గద్దం పూలమ్మ మాట్లాడుతూ కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు అపరిశుభ్రంగా వస్తున్నాయని, మంచినీటి బావి నుంచి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తాగేందుకు మినరల్ వాటర్‌ను కొనుక్కోవాల్సి వస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి బావి నీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో చలమల సత్తమ్మ, శాంతమ్మ, భారతమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీబిందెలతో గిరిజనుల నిరసన



కేసముద్రం: నిరసన తెలుపుతున్న తండావాసులు

కేసముద్రం : మండలంలోని నారాయణపురం శివారు చెరువుకొమ్ము తండాలో తాగునీటి సమస్య తీర్చాలని స్థానికులు ఖాళీ బిందెలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. తండాలో తాగునీరు అందించే సోలార్‌పంపు రిపేర్, ట్యాంకు మరమ్మతు చేయించి దాహార్తి తీర్చాలని తండావాసులు డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పందించి తమ దాహార్తిని తీర్చాలని వేడుకున్నారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

‘కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాటం’



నెహ్రూసెంటర్ : జెండా ఆవిష్కరిస్తున్న ఉపేందర్



గార్ల: సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న వీరస్వామి



మరిపెడ: జెండా ఆవిష్కరిస్తున్న ఉప్పలయ్య

నెహ్రూసెంటర్ : కార్మికుల హక్కుల రక్షణ, వేతనాల పెంపునకు సీఐటీయూ పోరాటాలు నిర్వహిస్తూ అనేక విజయాలు సాధించిందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో గురువారం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాలకవర్గాలు కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాసే క్రమంలో నిరంతరం పోరాటాలు సాగించిన సంఘం సీఐటీయూ అని పేర్కొన్నారు. కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తూనే అన్ని రకాల దోపిడీలను అంతమొందించడమే సీఐటీయూ లక్ష్యమన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్ చట్టాలను రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమ్మెట రాజమౌళి, తోట శ్రీనివాస్, బత్తుల వెంకన్న, హేమ, శ్రీనివాస్, సుధాకర్, జానీ, వెంకన్న, సారయ్య, రాములు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

మరిపెడ/మరిపెడ రూరల్ : కార్మికుల పక్షాన నిలబడుతూ వారి హక్కుల కోసం నిరంతరం సీఐటీయూ పోరాడుతోందని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య అన్నారు. గురువారం మరిపెడ పట్టణ కేంద్రంలోని స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మిక జెండాను ఉప్పలయ్య ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన వారి హక్కుల కోసం పోరాడుతూ అనేక విజయాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండ వీరస్వామి, ముత్తయ్య, సుంకరి వెంకన్న, లింగన్న, చిన్న నాగన్న, పరశురాములు, బిక్కునాయక్, అనపర్తి ఉపేందర్, అర్జయ్య తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు

కేసముద్రం : కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ పతాకాన్ని ఆవిష్కరించారు. చాగంటి కిషన్, మురళి, గుంజపాడుగు శ్రీను, జాటోత్ మంగీలాల్, రవి, ఉప్పలయ్య, యాకమ్మ, దేవేంద్ర పాల్గొన్నారు.

గార్ల : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం గార్లలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు అంబటి వీరస్వామి, బండ్ల అప్పిరెడ్డి, దాసు, ఎస్.నాగరాజు, ప్రవీణ్, భిక్షం, నవీన్, సర్వేశ్వరరావు, సంపత్, వేణు, ఎల్లయ్య, అంజయ్య, రమేష్, తదితరులు పాలొన్నారు.

డీలర్లు నిబంధనలు అతిక్రమించొద్దు



డోర్నకల్: దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ



బయ్యారం: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ



దంతాలపల్లి: ఆగాపేటలో..



మరిపెడ: తనిఖీ చేస్తున్న అధికారులు



గంగారం: మాట్లాడుతున్న ఏఓ ఉదయ్

- ఏడీఏలు కె.శోభన్‌బాబు, ఎం.లక్ష్మీనారాయణ

డోర్నకల్ : విత్తన, పురుగు మందుల దుకాణ డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.శోభన్‌బాబు హెచ్చరించారు. మండలంలోని ముల్కలపల్లి, మన్నెగూడెం, అందనాలపాడు, చిలుకొయ్యలపాడు గ్రామాల్లో గురువారం విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు నిర్వహించారు. అనంతరం దుకాణాల్లో విత్తన ప్యాకెట్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తీసుకునే రశీదులు పంట పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు. గడువు ముగిసిన, లూజు విత్తనాలు కొనుగోలు చేయొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఏఈఓ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

బయ్యారం : విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని గౌరారం, చర్లపల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోలు, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలకు వచ్చే వారి నుంచి లూజు విత్తనాలు కొనుగోలు చేయొద్దని, గుర్తింపు పొందిన డీలర్ ద్వారానే విత్తనాల కొనుగోలు చేయాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఏడీఏ వివరించారు. కార్యక్రమంలో ఏఓ రాంజీ, ఏఈఓలు సురేష్, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

దంతాలపల్లి : రైతులు ఆయిల్‌పామ్ సాగుచేయడం వల్ల అనేక లాభాలు పొందవచ్చని వ్యవసాయ విస్తరణాధికారులు దీక్షిత్ కుమార్, సందీప్ అన్నారు. మండలంలోని తూర్పుతండా, ఆగాపేట గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ సాగు, విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ భూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల రైతులకు కూలీల ఖర్చు తగ్గడంతో పాటు, పెట్టుబడి, కోతుల బెడద, చీడ, పీడల బాధలు ఉండవన్నారు. వానాకాలంలో విత్తనాలు కొనుగోలు చేసే రైతులు పలు జాగ్రత్తలు వహించాలన్నారు. లైసెన్స్‌లు ఉన్న అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. రశీదు తీసుకోని పంటకాలం పూర్తి అయ్యేంత వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

మరిపెడ : నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేయాలనుకుంటే క్రిమినల్ కేసులు తప్పవని మరిపెడ సీఐ హథీరాం నాయక్ హెచ్చరించారు. ఇందులో భాగంగా మరిపెడ కేంద్రంలోని సూర్యతేజ ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాన్ని వ్యవసాయ శాఖ అధికారి వీరాసింగ్ ఆధ్వర్యంలో సీఐ గురువారం తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ దుకాణంలోని స్టాక్ రిజిస్టర్, విత్తనాల రశీదు బుక్స్‌ను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసుకున్న విత్తనాలకు రశీదు అందించాలన్నారు. నకిలీ, గడువు దాటిన విత్తనాలు విక్రయిస్తే సదరు డీలర్లపై శాఖపరమైన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై తహీర్‌బాబా పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

గంగారం : రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయ అధికారి ఉదయ్ అన్నారు. గురువారం మండలంలోని విత్తన షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తన షాపు యజమానులు ప్రభుత్వం అమోదించిన విత్తనాలను రైతులకు విక్రయించాలన్నారు. అధిక లాభాపేక్షకు ఆశపడి నకిలీ విత్తనాలు అంటకట్టి ఇబ్బందులు పడొద్దన్నారు. రైతులకు కొనుగోలు చేసిన వెంటనే విత్తనాలకు సంబంధించిన బ్యాచ్ నంబర్‌తో పాటు రశీదులో రాసి ఇవ్వాలని కోరారు. షాపులలో స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. లేదంటే షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో విత్తన షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం..

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



తొర్రూరు రూరల్ : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఇటీవల గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మహంకాళి సాయిమల్లును గురువారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్ట కాలంలో తనకు అండగా నిలిచిన పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని తెలిపారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలి



కొత్తగూడ: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ప్రభుత్వమే అందజేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బూర్క వెంకట్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో వడ్డీ వ్యాపారుల దోపిడీని అరికట్టాలన్నారు. దొడ్డు వరి ధాన్యానికి రూ. 500 బోనస్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వజ్జ సమ్మక్క, శ్రీశైలం, పోతన్న, సుమలత, అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.